మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## జోగిపేట ఎక్సైజ్ సిఐని వెంటనే సస్పెండ్ చేయాలి

**జోగిపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

జోగిపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాగర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం అందోలు డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జోగిపేటలో విలేకరులతో మాట్లాడుతూ బెల్టు షాపులవారు ఇచ్చే మామూళ్లకు ఆశపడి, వారికి మద్దతుగా ఎక్సైజ్ సిఐ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏకంగా గ్రామంలో బెల్టుషాపులను నియంత్రించాలని పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ సర్పంచి ఎక్సైజ్ సిఐని ఫోన్‌లో సంప్రతిస్తే, దానికి విరుద్ధంగా ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం మద్యం నుంచే వస్తుందని, దానిని నియంత్రించమనటం సరికాదని సర్పంచికే సిఐ సర్ది చెప్పటమంటే బెల్టుషాపుల నుంచి వచ్చే మామూళ్లు పెద్దమొత్తంలో అందుతున్నాయని స్పష్టమౌతుందని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాల గురించి ఈ సిఐకి ఏమాత్రం పట్టింపులేదని, ఇలాంటి సిఐని వెంటనే విధుల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని సిపిఎం డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ హెచ్చరించారు.

## కేంద్ర మాజీమంత్రి శివరాజ్ పాటిల్ మృతి

### -వీరశైవ లింగాయత్ సమాజానికి తీరని లోటు

**సదాశివపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నేత శివరాజ్ పాటిల్ అనారోగ్యంతో మహారాష్ట్రలోని లాతూర్‌లో మృతిచెందారు. లాతూర్ నుంచి ఏడుసార్లు లోకసభకు ఎన్నికైన ఆయన, కేంద్ర మంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారు. ముఖ్యంగా వీరశైవ లింగాయత్ సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి మహానేత ఈ రోజు మన మధ్య లేకపోవడం వీరశైవ లింగాయత్ సమాజానికి తీరని లోటు అని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం మాజీ ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాశ్ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. శివరాజ్ పాటిల్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మహాత్మ బసవేశ్వరుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

## ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచులు



మంత్రి వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచులు

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట, సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లి గ్రామాలకు చెందిన సర్పంచులు శనివారం రాష్ట్ర కార్మిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సమక్షంలో హైదారాదాద్‌లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజగోపాల్‌పేట సర్పంచి చేర్యాల వాణికృష్ణ, నాంచార్‌పల్లి సర్పంచి పురమాండ్ల నరసింహారెడ్డిలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పార్టీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి గడ్డం వివేక్‌వెంటకస్వామి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి స్వచ్ఛందంగా ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని తెలిపారు. రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలన్నారు.

## ఉపాధిహామీ పథకం నిర్వీర్యం చేయాలని కేంద్రం కుట్రలు

### -మహాత్ముల పేర్లు చెరిపేసే కుట్రకు పాల్పడుతున్న కేంద్రప్రభుత్వం
### -రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

దేశంలో మహాత్ముల పేర్లను చెరిపేసే విదంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీ చౌరస్తా లోగల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేస్తుందని, ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేయాలని ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న ప్రజలకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఉండేదని గుర్తుచేశారు. ఎన్నికల ఎజెండాలో అర్బన్ ప్రాంతాల్లో ఉపాధి హామీ తీసుకొస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం చివరకు ఉపాధి హామీ పథకాన్ని తొలగిస్తూ.. నిర్వీర్యం చేయాలని కుట్ర చేయడంతో పాటు మహాత్మాగాంధీ పేరును అవమానపరిచే విధంగా ఉపాధి హామీ పథకంలో ఆయన పేరును తొలగించి విబిజి రామ్‌జీ పేరును తీసుకొస్తుందన్నారు. ఇప్పటికే నెహ్రూ, ఇందిరాగాంధీ, మహాత్మాగాంధీల పేర్లు లేకుండా చేయాలని కుట్ర చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా నేడు (ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ ఫోటోలు పెట్టుకొని ఉపాధి కార్యక్రమాలు చేస్తూ, బిల్లుపై నిరసనలు చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, సీనియర్ నాయకులు చిత్తారి రవిందర్, పద్మ, అక్కు శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# మాంజాదారాల అమ్మకం నిషేధం

### -మాంజాదారాలు అమ్మే వ్యాపారులపై కఠినచర్యలు
### -జిల్లా కలెక్టర్ కె.హైమావతి




సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రమాదాలకు గురిచేస్తున్న మాంజాదారాల అమ్మకం నిషేధించడం జరిగిందని జిల్లాలో మాంజాదారాలను అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. గాలిపటాలను ఎగురవేయడానికి సాధారణ దారాలకు బదులుగా మాంజాదారాలు ఉపయోగించడం మూలంగా మంజాదారాలు తగిలి తరచుగా వివిధ ప్రాంతాలలో వాహనదారులు, పశువులు, పక్షులు ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని ఇలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా మాంజాదారాలను విక్రయించరాదని అన్నారు. ఆదేశాలను పాటించకుండా మంజాదారాలను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే అధికారులు జిల్లా వ్యాప్తంగా మాంజా దారాలు అమ్మకుండా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు.

**29న ప్రజావాణి...**

జిల్లా కలెక్టరేట్‌లో ఈనెల 29న ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. 29న కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**వీధికుక్కల నియంత్రణచర్యలు చేపట్టాలి...**

వీధికుక్కల నియంత్రణ, వాటి షెల్టర్ హోమ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పోలీసు, గ్రామ పంచాయతీ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య, విద్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారులతో జిల్లాలో కుక్కల నియంత్రణపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కుక్కల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గ్రామీణ ప్రాంతాలలో కుక్కల షెల్టర్ హోమ్‌ను నిర్మించి ఆయాప్రాంతాలలోగల కుక్కలను షెల్టర్ హోమ్‌కు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి షెల్టర్ హోమ్‌లోనే వాటిని ఉంచాలన్నారు. దీనివల్ల రహదారుల వెంబడి జరిగే ప్రమాదాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కుక్కకాట్ల నుండి ప్రజలను రక్షించడానికి వీలవుతుందని వెంటనే కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి కొండల్‌రెడ్డి, అడిషనల్ డిసిపి సుభాష్‌చంద్రబోస్, డిపిఓ రవీందర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ ధనరాజ్, డిటిఓ లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌అండ్‌బి, నేషనల్‌హైవే, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మోడల్ పాఠశాలను తనిఖీ చేసిని కలెక్టర్...**

**చిన్నకోడూరు, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పలువురు ఉపాధ్యాయులు సెలవుల్లో ఉన్నారని తెలపగా ఆన్‌లైన్ పోర్టల్‌లో సెలవు అనుమతి ప్రక్రియను తనిఖీ చేశారు. పాఠశాల వాతావరణం చాలా బాగుందని విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలన్నారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం అదే గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరువాత అదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాజరు, ఓపి రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సెలవుల్లో, డిప్యూటేషన్‌లో ఉంటే తప్పనిసరిగా ఆసుపత్రిలో లెటర్ పెట్టాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్..



సీజ్ చేసిన ట్రాక్టర్

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

మంజీరానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పాపన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన శుక్రవారంరాత్రి చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఎంకేపల్లి గ్రామానికి చెందిన బద్రి అంజయ్యా, సలీం పాషాలు ట్రాక్టర్లతో శివారులో ఉన్న మంజీరానది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక పోలీసులు వెళ్ళగా, మంజీరానది నుండి ఇసుకను రవాణాచేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసి, పాపన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి, పోలీసులకు అప్పగించడంతో పాపన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కిరాణా కొట్టులలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు



కిరాణా కొట్టులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**పుల్‌కల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని లక్ష్మీసాగర్ గ్రామంలోని కిరాణా కొట్టును ఎక్సైజ్ పోలీసులు శనివారం తనిఖీ చేశారు. గ్రామంలో బెల్ట్ షాపులను అరికట్టేందుకు సర్పంచ్ ఉప్పరి లక్ష్మణ్ జోగిపేట ఎక్సైజ్ సిఐ సాగర్‌రెడ్డికి ఫిర్యాదుచేయడంతో గ్రామంలోని కిరాణా దుకాణాలను ఎక్సైజ్ పోలీసులు తనిఖీచేశారు. ఇటీవల పంచాయతీ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి కిరాణా దుకాణాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తుండటంతో సర్పంచ్ సూచనల మేరకు పోలీసులు దుకాణాలను తనిఖీచేశారు. గ్రామానికి చెందిన నలుగురు కిరాణా దుకాణాల వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ సాగర్‌రెడ్డి హెచ్చరించారు.

## నిషేధిత చైనామాంజా విక్రయిస్తే కఠినచర్యలు

### -గజ్వేల్ ఎసిపి నరసింహులు



గాలిపటాల దుకాణంలో తనిఖీచేస్తున్న ఎసిపి నరసింహులు

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని గజ్వేల్ ఎసిపి నరసింహులు అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో గాలిపటాలు అమ్మే దుకాణాల్లో ఎసిపి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఎసిపి నరసింహులు మాట్లాడుతూ దుకాణదారులు ఎవరూ నిషేధిత చైనా మాంజాను విక్రయించకూడదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలు జరిపితే వారిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోవడంతోపాటు షాపుల లైసెన్స్‌లు రద్దుచేస్తామని స్పష్టంచేశారు. ప్రజలందరూ సహకరించి సురక్షితంగా సంక్రాంతిని జరుపుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో గజ్వేల్ అడిషనల్ సిఐ ముత్యంరాజు, ఎస్ఐలు ప్రేమ్‌దీప్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## అధికారుల పర్యవేక్షణ లోపం.. మండల ప్రజలకు శాపం..

### -ఆరునెలలుగా ఆసుపత్రిలో రాత్రిళ్లు కాన్పులు బంద్..
### -మెదక్‌కు రెఫర్
### -తహసీల్దార్ విచారణలో వెలుగులోకి వచ్చిన వైనం..

**టేక్మాల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీలో ఆసుపత్రి గత మూడునెలలుగా అంధకారంలో ఉందనే విషయాన్ని విని ఆయనే అవాక్కయ్యారు. వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానిక తహసీల్దార్ తులసీరాంకు ఆదేశాలను జారీచేయగా శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిని సందర్శించి సమస్యలపై ఆరాతీశారు. వెంటనే కరెంట్ సమస్యను తాత్కలికంగా పరిష్కరించేందుకుగాను మరమ్మతులను చేయించారు. టేక్మాల్ మండల ప్రభుత్వ ఆసుపత్రి 24 గంటలు ప్రజలకు సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో కరెంట్ లేదు. వాష్‌రూంలతో పాటు డ్రైనేజ్ పూర్తిగా బ్లాక్ అయిపోయినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా ఆసుపత్రిలో ఆంధకారం నెలకొనడంతో రాత్రి వేళలో కాన్పులు(డెలివరి కేసులు) చేయడం లేదని, వారిని మెదక్ ఆసుపత్రికి రెఫర్‌చేస్తున్నట్లు సిబ్బంది తహసీల్దార్‌కు వివరించారు. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. విద్యుత్ లేక పోవడంతో రాత్రుళ్లు కాన్పులు వస్తే మెదక్‌కు రెఫర్ చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో మెయింటెనెన్స్ లేకపోవడం తో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. డాక్టర్ సమయ పాలన పాటించకపోవడంతో రోగులు నిరాశానిస్పృహలకు లోనై వెనుదిరిగి వెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉద్యోగులు పనిచేసే చోట ఉండాలని సూచిస్తుంది. కాగా ప్రభుత్వ ఆదేశాలనునతుంగలో తొక్కి, ఉద్యోగులు ఉదయం 11 గంటలకు ఆసుపత్రిలో, మధ్యాహ్నం 3 గంటలు దాటితే ఇంట్లో అన్నట్లు ఇక్కడి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. విధులకు డుమ్మాలు కొట్టే అధికారుల భరతం పట్టేందుకుగాను ప్రభుత్వం బయోమెట్రిక్ విధానం ప్రవేశ పెట్టినా, అది కాస్తా ఇచ్చిన నెలరోజులకే పనిచేయడం మానే సింది. విధులపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని "ప్రభాతవార్త" పరిశీలించి చూస్తే ఇందులో కొందరు గత కొన్నేళ్ళుగా ఇక్కడే పాతుకుపోయారు. ఆసుపత్రిని ఎవరూ పట్టించుకోకపోవ డంతో ఇక్కడి ప్రజల నాడి వారికి దొరికిపోయి ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో ప్రభుత్వ ఉద్యోగాన్ని పార్ట్ టైం ఉద్యోగంగా మార్చేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడి వారు పట్టణాల్లో సొంతంగా వేరే వ్యాపారాలలో బిజీ అయి పట్టణాలకే పరిమితం అవుతున్నారని పలు ఆరోపణలు బలంగా వస్తున్నాయి. వారికి ఎదురులేదన్న ధీమాతో తమ ఇష్టానుసారంగా విధులకు హాజరవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారన్నది జగమెరిగిన సత్యం. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇలాకాలోనే ఇలా ఉంటే, మారుమూల గ్రామాల ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహిస్తే అర్థం అవుతుంది. ఇకనైనా ఆసుపత్రిపై కమ్ముకున్న నిర్లక్ష్యాన్ని తొలగించి, ప్రజలకు ఆరోగ్య సేవలను అందించేందుకుగాను చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**మంత్రి దృష్టికి ఆసుపత్రి సమస్యలు తీసుకెళ్తాం..**

టేక్మాల్ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల గురించి తెలుసుకున్న టేక్మాల్ సర్పంచ్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచ్ పాపయ్య, విద్యుత్ ఎఈ ఉదయ్‌భాస్కర్, మాజీ మండల కోఆప్షన్ మజర్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమస్యలపై ఆరాతీసారు. ఆసుపత్రిలో మరమ్మతుల కోసం అధికారులు వేసిన అంచనా పత్రాన్ని తీసుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.




ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ తులసీరాం

## బైకును ఢీకొన్న ఆర్టీసి బస్సు



బస్సు ఢీకొనడంతో గాయాలపాలైన వాహన చోదకుడు

**చౌటకూరు, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని సరాఫ్‌పల్లి గ్రామ బస్ స్టేజి వద్ద ఆర్టీసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో యువకుడు తీవ్రగాయాలకు గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్(35) ఎపి 28బి 8662 ద్విచక్ర వాహనంపై అండర్‌పాస్ గుండా గ్రామానికి వస్తున్న తరుణంలో మెదక్ డిపోకు చెందిన టిఎస్ 35టి 1310 ఆర్టీసి బస్సు సంగారెడ్డివైపు నుంచి సరాఫ్‌పల్లికి అతివేగంగావస్తూ నరేష్‌గౌడ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో నరేష్‌గౌడ్‌కు బలమైన గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం కుటుంబసభ్యులు నరేష్‌గౌడ్‌ను సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసి బస్సును అక్కడినుంచి కదలనీయకపోవడంతో ప్రయాణికులను మరో బస్సులో తరలించడం జరిగింది.

## ఆటో బోల్తా-వ్యక్తి మృతి

**జోగిపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

కోతులను తప్పించబోయిన ఆటో బోల్తాకొట్టి చెరువులో పడటంతో అందులో ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ఆటోడ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం ఉదయం అన్నాసాగర్‌వద్ద జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మికుంటనుంచి జోగిపేటకువస్తున్న ఆటో అన్నాసాగర్ చెరువుకట్టపై కోతులు అడ్డంరావటంతో వాటిని తప్పించబోయి అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో జమ్మికుంటకు చెందిన విజయరావు(52) అక్కడే మృతిచెందగా, డ్రైవర్ మహేష్‌కు గాయాలయ్యాయి. కాగా, శనివారం ఉదయంపూట మృతుడు మామిడి విజయరావుకు వ్యవసాయపొలంవద్ద స్వల్పంగా విద్యుత్‌షాక్ తగలటంతో అతడిని వైద్యం కోసం జోగిపేటలో ఆటోలో తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు మృతుడి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుత్నుట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## బస్సు, టిప్పర్ ఢీ-20మంది మహిళలకు గాయాలు

**కంది, డిసెంబరు 27, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కంది చౌరస్తా నుంచి పటాన్‌చెరుకు వెళుతున్న ఆర్టీసి బస్సు, టిప్పర్‌లు శనివారం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆర్టీసి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు గాయాలకు గురయ్యారు. క్షతగాత్రులైన మహిళలను వేరువేరు అంబులెన్స్‌లలో చికిత్సనిమిత్తం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## దుర్గమ్మ సన్నిధిలో ఎస్టీ, ఎస్సీ కమీషన్ చైర్మన్

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవాని మాతను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. శనివారం ఆయన ఏడుపాయలకు చేరుకోగా ఆలయ ఇఓ చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన వనదుర్గాభవాని మాతను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఓ చంద్రశేఖర్ శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

## ఎమ్మెల్యేని కలసిన పెద్దాపూర్ సర్పంచ్

**సదాశివపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలం పెద్దాపూర్ సర్పంచ్‌గా విజయం సాధించిన మనీషాబాలరాజ్‌గౌడ్ శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నూతన సర్పంచ్ దంపతులకు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటు, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల అభివృద్ధికి తన పూర్తిమద్దతు, సహకారం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అయ్యప్ప ఆలయాన్ని సందర్శించిన ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్


అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న మొహీద్ పటేల్

**నారాయణఖేడ్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని రామ మందిరంలో శుక్రవారం అయ్యప్ప స్వాములకు అల్పాహార బిక్షను నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్ ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములతో కలిసి అన్నప్రసాదం (బిక్ష)ను స్వీకరించారు.ఈ సందర్భంగా న్యాయవాది మొహీద్ పటేల్ మాట్లాడుతూ, అయ్యప్ప స్వాములకు అల్పాహార బిక్ష ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. భారతదేశం అనేది విభిన్న మతాలు, సంస్కృతులు కలిసిన దేశమని, అన్నిమతాల పండుగలను పరస్పర గౌరవంతో, సంప్రదాయబద్ధంగా కలిసి జరుపుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు న్యాయవాది మొహీద్ పటేల్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

-గ్రామ సర్పంచ్ రజిత

**జగదేవ్‌పూర్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
పౌష్టికాహారంతోనే తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తీగుల్ గ్రామ సర్పంచ్ కుదుదుల రజిత అన్నారు. శనివారం మండల పరిధిలోని తీగుల్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం నూతన సర్పంచ్ రజితను అంగన్వాడీ టీచర్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీటీచర్ రుక్మిణి, ఆయా బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాలి

-దేవి రవీందర్

**జగదేవ్‌పూర్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
గ్రామ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తూ మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని రైతుబంధు మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామ నూతన సర్పంచ్ కుదుదుల రజిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ మండలంలో పెద్ద గ్రామపంచాయతీ అయిన తీగుల్ గ్రామంలో భారీ మెజార్టీతో రజిత గెలుపొందడం అభినందనీయమన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజా నాయకురాలిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లయ్య, పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, గ్రామ నాయకులు మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులుగా పట్లోళ్ల మధుకర్‌రెడ్డి

**నర్సాపూర్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా అహ్మద్ నగర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల మధుకర్ రెడ్డి ని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు మండల సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులుగా కాజీపేట్ సర్పంచ్ దొంతి యాదగిరి గౌడ్, జనరల్ సెక్రెటరీగా ఎల్లారెడ్డి గూడ తండా సర్పంచ్ నేనావత్ బిక్కు నాయక్, కోశాధికారిగా రాంజ్యా తాండ సర్పంచ్ నర్సింగ్ నాయక్, సలహాదారులుగా ఆవంచ సర్పంచ్ రాజంపేట ప్రవంతి కరుణాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బాబ్యా నాయక్ చిప్పల్ తూర్తి సర్పంచ్ మస్కూరి సుధాకర్ మాజీ సర్పంచులు నడిపి లావణ్య రవి ఉమ్లా నాయక్ సేనాధిపతి సామ్యానాయక్ వెంకటేష్‌గౌడ్ కరుణాకర్ పాల్గొన్నారు.

## వేలం పాటలతో ఏడుపాయల ఆలయానికి 2.కోట్ల 31 వేల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
ఏడుపాయల దుర్గమ్మ ఆలయానికి వేలం పాటల ద్వారా 2కోట్ల 31వేల ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఇఓ చంద్రశేఖర్ లు వెల్లడించారు. పుణ్య క్షేత్రం వద్ద కొబ్బరికాయలు, ఓడి బియ్యం ప్రోగుచేసుకునే హక్కు లకోసం సీల్ టెండర్, బహిరంగ వేలం పాటలను ఏడుపాయల దేవస్థాన కార్యాలయం లో శనివారం మధ్యాహ్నం నిర్వహించగా. పలు ప్రాంతాల కు చెందిన ఆసక్తి గల టెండర్ దారులు పాల్గొనగా మెదక్ పట్టణానికి చెందిన లింగీజీ ఒక్క కోటి 10, లక్షల ముప్పయి వేల కు కొబ్బరి కాయలు సంవత్సరం పాటు విక్రయించుకునే హక్కును పొందగా. అమ్మవారికి మొక్కుల రూపేణ భక్తులు చెల్లించిన , బంగారు, వెండి ఆభరణాలు మినహా ఓడి బియ్యం ప్రోగుచేసుకునే హక్కును ఎల్లాపూర్ గ్రామానికి చెందిన జనార్ధన్ 91లక్షల హెచ్చు పాటతో హక్కును పొందారు. కాగా దేవస్థానం వద్ద పూజా సామాగ్రి, ఎంటర్ టైన్ మెంట్ నిర్వహణలకు సరైన పాట రానందుకు వేలం పాటలు రద్దు చేసి తిరిగి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నట్టల మందు పంపిణీ చేసిన సర్పంచి

**రామాయంపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామంలో శనివారం జీవాలకు నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు ప్రారంభించారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా ఉచితంగా నట్టల మందు పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విచారణ వట్టి ముచ్చటేనా...!?

-బీమా క్లెయిమ్‌లో ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉందా...!?
-20రోజులు దాటినా పట్టించుకోకపోవడానికి కారణం ఏంటి..?
-హుస్నాబాద్ వ్యవసాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



హుస్నాబాద్‌లోని రైతువేదిక దృశ్యం

**హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు27, ప్రభాతవార్త:**
గడిచిన ఇరవై రోజుల క్రితం ప్రభాతవార్తలో నకిలీ ధృవపత్రాలతో రైతు బీమా క్లెయిమ్ అనే శీర్షికతో వార్త ప్రచురించగా ఆవిషయంలో స్పందించిన వ్యవసాయశాఖ ఎడిఎ వీణరెడ్డి తాను హుస్నాబాద్ ఎడిఎగా నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని, అయినా ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి అధికారుల తప్పిదం ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. అయితే ఈ వార్త బయటకు వచ్చి దాదాపు 20రోజులు దాటినా అసలు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. అయితే నకిలీ క్లెయిమ్ విషయంలో నిరుపేద కుటుంబానికి చెందిన మరణించిన రైతు బంక శ్రీనివాస్‌యాదవ్ క్లెయిమ్ నకిలీ పత్రాలు సృష్టించి క్లెయిమ్ చేయించిన వ్యవసాయశాఖ ఏఈవో బీమా క్లెయిమ్ అయిన తర్వాత రూ 2 నుండి 3 లక్షల వరకు వసూలు చేసారని ఆరోపణలు ఉన్నాయి. అయితే సదరు ఏఈవో హుస్నాబాద్ ప్రాంతానికి చెందినవారే అని, అధికారులతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయని, హుస్నాబాద్‌కు ఆ శాఖలో పనిచేసే ఏ అధికారి వచ్చినా కార్లలో తిప్పడంతో పాటు వారికి కావాల్సిన భోజనంతో పాటు అవసరాలు తీరుస్తుంటాడని తెలుస్తోంది. అయితే అతనిపై అవినీతి ఆరోపణలు ఎప్పటి నుండో ఉన్నా, ఇదే కారణంతో అధికారులు పట్టించుకోవడం లేదని అర్థమౌతుంది. ఈ బీమా క్లెయిమ్ ఏప్రిల్ 11వ తేదీ 2025 రోజున జరిగి, ఈ అవినీతివ్యవహారం బయటపడడంతో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎఈవోకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మెమో ఇవ్వడంతో పాటు ఎడిఎకు ఈ విషయంలో విచారణ చేయాలని ఆదేశాలు జారీచేసినా, అప్పుడు ఇక్కడ ఇంచార్జీగా ఉన్న ఎడిఎ మల్లయ్య సైతం ఈ విషయాన్ని కప్పిపెట్టినట్లు అదే శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది బాహాటంగానే అనుకుంటున్నారు. రైతు బీమాను క్లెయిమ్ చేయించి లబ్దిదారుల నుండి డబ్బులు వసూలు చేసిన ఎఈవో తనకు విష జ్వరం వచ్చిందని అధికారులను నమ్మించి తన స్నేహితులతో కలిసి బ్యాంకాక్ ట్రిప్‌కు వెళ్లి సామాజిక మాధ్యమాలలో ఆ ఫోటోలను అప్‌లోడ్ చేసాడనే గుసగుసలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారులు విదేశీ యాత్రలకు వెళ్లాలంటే 45 రోజులముందు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులు పరిశీలించి ఆమోదం తెలుపుతారని, కానీ ఈ ఏఈవో ఎలాంటి అనుమతులు లేకుండా దాదాపు 20రోజులు విదేశాలకు వెళ్లాడని అయితే ఈ విషయం గతంలో ఇక్కడ పనిచేసిన ఏవో, ఎడిఎలకు తెలిసే జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమౌతుండగా, ఈ నకిలీ క్లెయిమ్ బాగోతంలో ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉండి ఉంటుందని కింది స్థాయి సిబ్బంది అనుకుంటున్నారు. రెండు నెలల క్రితమే జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆదేశాలను బేఖాతర్ చేసిన హుస్నాబాద్ అధికారులు ప్రభాతవార్త కథనాలకు స్పందించి విచారణ చేస్తామని చెప్పి కూడా ఇరవై రోజులు గడిచినా ఎలాంటి విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ఎడిఎ వీణరెడ్డి విచారణ ఎంతవరకు వచ్చిందని వివరణ కోరేందుకు ప్రభాతవార్త ఫోన్‌లో సంప్రతించగా రెండు రోజులుగా అందుబాటులోకి రావడం లేదు. ఏది ఏమైనా నిరుపేద కుటుంబానికి చెందిన రైతు బంక శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యుల బీమా క్లెయిమ్‌చేసి లక్షలు దండుకున్న అవినీతి అధికారులపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాల్సిన అవసరం ఉంది.

## అభివృద్ధి పనులను సమీక్షించిన కార్పొరేటర్ పుష్ప



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై శనివారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి అధికారులతో డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న కార్పోరేటర్ కార్యాలయంలో సమీక్షించారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు కార్పోరేటర్ సూచించారు. త్వరలో డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలు హాజరవుతున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మావిన్ గౌడ్, పీటర్ జైపాల్, నవీన్ గౌడ్, గోపాల కృష్ణ, శామ్యూల్, వినయ్ కుమార్, నాగభూషణం, బైకన్ నవీన్ యాదవ్, కాశాల వీరేశం, హన్మంతు, రమేష్, సుంకు స్వామి, ఉమా మహేష్, కిషోర్, ఖాజా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ఆందోళన

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252ను వెంటనే సవరించాలని జిల్లా టియుడబ్ల్యూజే-ఎచ్ 143 జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అక్రిడేషన్ల కార్డుల జారీలో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద వైఖరిని మానుకోవాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో ఏఓకు అందజేశారు. గత ప్రభుత్వం 23 వేల అక్రిడేషన్ కార్డులు ఇవ్వగా కొత్త జీవోతో 10 వేలకు పైగా కార్డులకు కోతపడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో కఠినమైన నిబంధనలతో అక్రిడేషన్ రూల్స్ రూపొందించారని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే-హెచ్ 143 జిల్లా నాయకులు నాగరాజు, అశోక్,చ నవీన్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, కళాచందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్‌కు తరలిన నియోజకవర్గ జర్నలిస్టులు

**నారాయణఖేడ్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
ప్రభుత్వం నూతనంగా తెచ్చిన జర్నలిస్ట్ జీ ఓ 252 నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ కు టీయూడబ్లూజేహెచ్ 143 ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. జీఓ 252 రద్దు చేసి పాత ప్రభుత్వ విధానమే కొనసాగించాలని అన్నారు.నూతన విధానం వల్ల అనేక మంది జర్నలిస్ట్ లు నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి నారాయణఖేడ్ నుండి టీయూడబ్లూజేహెచ్ 143 సభ్యులు అమృతం టీవీ9, శ్రీకాంత్ నమస్తే తెలంగాణ, వెంకటేశం ఆంధ్రజ్యోతి, సయ్యద్ బిగ్ టీవీ, రమేష్ సాక్షి టీవీ, మారుతి రెడ్డి, ఆంధ్రప్రభ, వెంకటేష్ ఎస్‌కేఎస్, దత్తు ప్రజా దర్బార్, తదితరులు పాల్గొన్నారు.

## జీవో సవరించికపోతే ఆందోళన ఉధృతంచేస్తాం

-టియుడబ్ల్యుజె హెచ్ 143జర్నలిస్టుల నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 ను వెంటనే సవరించాలని సంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యుజె హెచ్ 143జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అక్రిడేషన్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని మానుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జి యాదగిరిగౌడ్ అధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ముందు శనివారం ఆందోళన దిగారు. అనంతరం ఆడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె హెచ్ 143 జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, నాయకులు దారాసింగ్ వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు, కరుణాకర్ రెడ్డి, క్రాంతి, నగేష్ గౌడ్, శ్రీకాంత్, అమృతం, ప్రదీప్, రాఘవరెడ్డి, నారాయణ, పవన్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

**చిన్నకోడూరు, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
గొర్రెల కాపరులు అందరూ నట్టల నివారణ మందులు సద్వినియోగం చేసుకోవాలని కస్తూరిపల్లి సర్పంచ్ తాళ్లపల్లి స్వామి అన్నారు.శనివారం మండల పరిధిలోని కస్తూరపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేడాదికి మూడు సార్లు తప్పకుండా జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. దీంతో తొందరగా ఎదగడానికి ఎంతో దోహదపడుతాయన్నారు. పశువైద్యాధికారి మంజుల తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో గొర్రెకాపరుల సంఘం నాయకులు శ్రీహరియాదవ్, ఉపసర్పంచ్ గోవిందగిరి స్వామి, వైద్య సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

## దళిత ద్రోహులు డిఈవో, డివైఎస్‌వో

-కరాటే మాస్టర్ కంటె రాజు

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
దళిత ద్రోహులు సిద్దిపేట జిల్లా డిఈవో, డివైఎస్‌వోలు అని హుస్నాబాద్ కరాటే మాస్టర్ కంటె రాజు అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా డిఈవో, డివైఎస్‌వోల తీరును నిరసిస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతూ దళిత కరాటే మాస్టర్‌లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ తమకు అన్యాయం జరిగిందని, దళితులమైన తాము డిఈవో, డివైఎస్‌వోల వద్దకు వెళ్లి చెబితే ఇద్దరు అధికారులు సమన్వయలోపంతో రెండు, నోటిఫికేషన్లు జారీ చేశామని, ఇప్పుడు ఏం చేయలేమని చేతులెత్తేయడంతో పాటు ఇదేంటని ప్రశ్నిస్తే మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరింపులకు దిగుతున్నారన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ నవిన్ నికోలస్ ఐఏఎస్‌కు కూడా ఇటీవలనే ఫిర్యాదు చేయగా తనకు న్యాయంచేస్తానని హామీ ఇచ్చారన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్న ఈ అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కరాటే మాస్టర్‌లతో పాటు దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఓల్డ్ ఎంఐజి కాలనీలో బస్తీ దర్శన్

-పాల్గొని సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ సింధు


బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీ (ఎఫ్ పార్క్ సమీపంలో)లో శనివారం నిర్వహించిన బస్తీ దర్శన్ కార్యక్రమంలో భారతీ నగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శరెడ్డి పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజి, పరిశుద్ధ్యంపై ప్రజలు అందించిన విన్నపాలను కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి మాట్లాడుతూ నీటి డ్రైన్‌లో డీసిల్టింగ్ పనులు చేపట్టాలని సంబంధత అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, బిఆర్ఎస్ నాయకులు సంపత్, రాకేష్, సొసైటీ డైరెక్టర్ వెంకటరావుఉ, సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, లోనా కుమార్, సరస్వతి, నరేందర్, గిరు పాల్గొన్నారు.

## వేలాడుతున్న విద్యుత్ వైర్లను మరమ్మతు చేయండి


వ్యవసాయ పంట పొలాలలో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

**నర్సాపూర్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామ వ్యవసాయ పంట పొలాలలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రజలకు అపాయకరంగా ఉన్నందున ఈ విద్యుత్ వైర్లను వెంటనే సరి చేయాలని గ్రామ నూతన సర్పంచ్ నీరుడు తుల్చమ్మ బిక్షపతి లు విద్యుత్ అధికారులకు వినతి చేశారు ఈ విద్యుత్ వైర్లు వేలాడడంతో పాటు పూర్తిగా స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు గతంలో గ్రామంలో విద్యుత్ వైర్లు తెగిపడి ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి గ్రామంలో పంట పొలాలలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి శిథిలావస్థకు చేరిన స్తంభాలను మార్చి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## గ్రామ సమస్యలు తీరుస్తా...

-బిఆర్ఎస్ సర్పంచ్ బైరి సురేష్...

**పాపన్నపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
తమ గ్రామంలో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ,గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చిత్రియాల్ గ్రామ సర్పంచ్ బైరి సురేష్ వెల్లడించారు, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులు కొనసాగిస్తామన్నారు ముందుగా నీటి సమస్య తీర్చడానికి బోర్లు వేయించి, మురికి కాలువల నిర్మాణం చేపడతామని విద్యుత్ సమస్య కూడా లేకుండా చూస్తామన్నారు, తమకు పార్టీలకు అతీతంగా గ్రామస్తులంతా సహకరించి గ్రామాభివృద్ధికి పాటుపడాల్సిందిగా ఆయన కోరారు.

## నూతన ప్రజాప్రతినిధులకు ఘనసన్మానం

**సదాశివపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలంలో వివిధ గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్,ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సతీష్ కుమార్ లు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించడం అభినందనీయమన్నారు. రానున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు.మంత్రి దామోదరరాజనరసింహ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటర్లు పంచాయతీ ఎన్నికల్లో అత్యదిక స్థానాల్లో పట్టం కట్టారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాసూద్ పటేల్,టిజసంగమేశ్వర్, శ్రీశైలం స్వామి, విట్టల్ రెడ్డి, సర్పంచ్ లు మల్లేశం,ల్యాగల అశోక్, వీరేశం, ప్రభుదాస్, ఆనంద్,బోడపల్లి అశోక్,మమత,లక్ష్మి, పవిత్ర, రాధాబాయి, రాములు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

**ధూళిమిట్ట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందును వినియోగించాలని జాలపల్లి గ్రామ సర్పంచ్ చెక్కూరి కమలాకర్ తెలిపారు.శనివారం మండలంలోని జాలపల్లి గ్రామంలో గొర్రెల,మేకలకు నట్టల నివారణ మందు వేశారు.ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి సాజిద్ అలీ మాట్లాడుతూ జీవాలకు వ్యాక్సిన్ వేయడం ద్వారా అవి ఆరోగ్యంగా ఉండాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్శరాములుగౌడ్, వార్డుసభ్యులు నరేష్, సత్తయ్య, యాదవ సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఝరాసంగం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం తండ్రి, మాజీ ఎంపిపి అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్ తల్లిలు తిరిగిరాని లోకాలకు చేరిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు శనివారం పార్థీవ దేహాలకు నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో జహీరాబాద్, కోహిర్, న్యాల్‌కల్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, మున్నూర్ రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు నామా రవికిరణ్, బండి మోహన్, యాకూబ్, మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

-ప్రముఖ సామాజిక సేవకర్త డాక్టర్ డి.ఓంప్రకాష్

**నారాయణఖేడ్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీరామ మందిరం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని యువతి యువకులు ముందుకొచ్చి విజయవంతం చేయగలరని తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీత, ప్రముఖ సామాజిక సేవకర్త డాక్టర్ డి ఓం ప్రకాష్ అయ్యప్ప స్వామి కోరారు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణ దానం కాబట్టి రక్తదానం చేద్దాం ప్రాణదాతలు అవుదాం అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీ రామ మందిరం సమయం: ఉదయం 11 గంటల నుండి రక్తదాన శిబిరం ప్రారంభం చేయడం జరుగుతుంది కావున రక్తదాతలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయగలరని కోరారు.

## స్ట్రెచర్‌పై గర్భిణీ మహిళను తరలించిన 108 సిబ్బంది

**పుల్‌కల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
పురుటి నొప్పులతో ఇబ్బందులు పడుతున్న గర్భిణీ మహిళలను 108 అంబులెన్స్ సిబ్బంది స్ట్రేచ్చర్‌పై ఆసుపత్రిలో చేర్పిన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని బొమ్మారెడ్డి గూడెంకు చెందిన బొమ్మరాజు అనూష పురుటి నొప్పులతో అవస్థలు పడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వడంతో మండల కేంద్రమైన పుల్‌కల్‌లో ఉన్న 108 వాహనం గ్రామానికి చేరుకుని గర్భిణి స్త్రీని ఆసుపత్రికి తరలిచేందుకు కోడూరు మీదుగా బొమ్మారెడ్డిగూడెంకు వెళుతున్న క్రమంలో బొమ్మారెడ్డిగూడెం ఎసన్‌చెరువు బ్యాక్ వాటర్ అడ్డుగా ఉండటంత గ్రామానికి వాహనం వెళ్లే అవకాశం లేకపోవడంతో (బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిన 108 వాహనం) చేసేది లేక108 సిబ్బంది స్ట్రేచ్చర్‌పై గర్భిణీ మహిళలను పడుకోబెట్టుకుని జాగ్రత్తలు పాటిస్తూ గర్భిణి మహిళ అనూషను అంబులెన్‌లో ఎక్కించి జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని మాత శిశు ఆరోగ్య కేంద్రం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. 108 సిబ్బందికి కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు 34వ వార్డులో ఉచిత మెగా వైద్య శిబిరం

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
అమెరికా తెలుగు సంఘం,34వ వార్డు ఆధ్వర్యంలో ఈనెల 29న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పారుపల్లి వీధి మహ్మామాయి దేవాలయం ఆవరణలో యశోద ఆసుపత్రి సికింద్రాబాద్ సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ వార్డు కౌన్సిలర్ గూడాల సంధ్యశ్రీకాంత్‌గౌడ్ శనివారం తెలిపారు. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులు, గుండెకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉచితంగా బిపి,జిఆర్‌బిఎస్, ఈసీజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9063126571,9063473167 నంబర్లను సంప్రదించాలన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ సదస్సును జయప్రదం చేయండి

**సదాశివపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో డిసెంబర్ 28న జనగామలో రాష్ట్రస్థాయి విద్యాసదస్సు నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయ మిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి సాయిలు శనివారం మండల గ్రామాలలోని పలు పాటశాలలు సందర్శించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా బలోపేతం చేయాలని, ప్రాథమిక పాఠశాలలను క్లాస్ కి ఒక టీచర్ ఉండే విధంగా చూడాలని, ఉపాధ్యాయ సమస్యలైన సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ విధానం రద్దుచేయాలని తదితర డిమాండ్స్‌పై జనగామలో జరుగుతున్న రాష్ట్ర విద్యాసదస్సులో చర్చించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని, ఈసదస్సుకు వక్తలుగా ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, ఆర్.టి.ఐ పూర్వకమిషనర్ మాడభూషి శ్రీధర్ హాజరవుతారని ,రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీమతి సీతక్క పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ సదాశివపేట మండల అధ్యక్షులు కే.శంకర్, టౌన్ కమిటీ అధ్యక్షులు ఎన్. సంజీవ్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి రూ.1.40లక్షల జరిమానా

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి రూ.1.40లక్షల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి, ఎస్ఐ నరేష్‌లు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు ప్రధానరోడ్లలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా 14మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని శనివారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సి.మణివీర్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి 14మందికి రూ.1.40లక్షల జరిమానా విధించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి, ఎస్ఐ నరేష్‌లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని కట్టడి చేయడానికి ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారితో పాటు ఇతరులకు ప్రమాదకరమని, ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి రూ.10వేల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు.

## పాండురంగాశ్రమంలో నాలుగోరోజు నాద సమ్మేళనం



పాండురంగాశ్రమంలో సామూహిక భోజనాలు చేస్తున్న భక్తులు

**మర్కుక్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
శతకోటి హరేరామ నామజప యజ్ఞంలో నాలుగోరోజు శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు హరేరామ భజనలతో నాద సమ్మేళనాన్ని ఆలపించారు. చుంచనకోట, తీగుళ్ల, కొండాపూర్, రాజపేట, నర్సన్నపేట, పాములపర్తి, రామ్‌శెట్టిపల్లి, అంగడికిష్టాపూర్ తదితర గ్రామాల నుండి భగవత్‌సేవా సమాజం శాఖల ప్రతినిధులు హాజరై నామసాగరంలో ఓలలాడారు. చుంచనకోట భువనేశ్వరపీఠం నిర్వాహకులు లలితామతిశర్మ తన శ్రావ్యమైన కంఠంతో ఏకధాటిన హార్మోనియం వాయిస్తూ రెండుగంటల పాటు హరేరామ భజనచేస్తూ, భక్తులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లారు. ఆ సమయంలో సాధ మంటప ప్రాంగణమంతా లయబద్ధమైన రామనామ స్మరణతో మార్మోగింది. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు ఆశ్రమంలో నిర్వాహకులు భోజన, పలహార, తేనీటి వసతిని అందించారు.

## న్యాయవాది నరసింహాచారికి ఘనసన్మానం



నరసింహాచారిని సన్మానిస్తున్న గడియారం వెంకటచారి

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం కేసులను విచారించడం కోసం గజ్వేల్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పోలోజి నరసింహాచారిని సభ్యునిగా నియమించినందుకు శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటాచారి, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొక్కొండ శ్రీనివాసచారి, బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, సీనియర్ న్యాయవాది కేతోజి వినోద్‌చారిలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మనుమయ సంఘం ప్రధాన కార్యదర్శి గడియారం విఠలచారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కోశాధికారి గడియారం నాగరాజుచారి, గుడ్డోజు వెంకటేశంచారి, బిజెపి సీనియర్ యువ నాయకుడు గడియారం రాజేశ్వర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో అధికారపార్టీకి చుక్కెదురు

**-ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవి రవీందర్

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌పార్టీకి చుక్కెదురైందని ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర కార్యనిర్వహణ మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్, గజ్వేల్ మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరాలు అన్నారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక మంత్రి హోదాలో ఉన్నటువంటి వ్యక్తులు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 90 స్థానాలు గెలిచామని చెబుతున్న మీరు బిఆర్ఎస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులను కూడా మీ ఖాతాలో వేసుకుంటారా అని విమర్శించారు. స్వతంత్ర అభ్యర్థులను కలుపుకొని లెక్కపెట్టుకొని మంత్రులకు అబద్ధాలు చెబుతారా అని విమర్శించారు. బిఆర్ఎస్‌పార్టీ తరపున గెలిచిన సర్పంచులను బెదిరింపులకు గురిచేయడం తగదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ కాసమొల్ల శ్రీనివాస్, కుర్రె మహేందర్‌రెడ్డి, చేబర్తి సురేష్, మద్ది నరేందర్, గాలెంక శ్రీనివాస్, ఉబ్బని నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు డీలిమిటేషన్‌పై కమిషనర్‌కు బిఆర్ఎస్ నేతల వినతి



జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

**రామచంద్రాపురం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయంలో కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను శనివారం బిఆర్ఎస్ నాయకులు కలుసుకుని వార్డు డీలిమిటేషన్‌పై వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ వార్డు డీలిమిటేషన్ కారణంగా ఎదురుకానున్న సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకుపోయామన్నారు. అమీన్‌పూర్ సర్కిల్ పేరును రామచంద్రాపురం సర్కిల్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్‌లోని ప్రజలు అమీన్‌పూర్ వెళ్లేందుకు పడరానిపాట్లు పడుతున్నారని గుర్తుచేశారు. తెల్లాపూర్ సమీపంలోని వెలిమల గ్రామాన్ని తెల్లాపూర్ డివిజన్‌లోకి తీసుకురావాలన్నారు. విద్యుత్ నగర్ కాలనీని తెల్లాపూర్ డివిజన్‌లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్ మాజీసర్పంచి సోమిరెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కుమార్ గౌడ్, తెల్లాపూర్ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, సర్కిల్ ప్రెసిడెంట్ పరమేష్ యాదవ్, బిఆర్ఎస్‌వి కో-ఆర్డినేటర్ చిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, అప్పల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 35లక్షలతో సెంటర్ డివైడర్ పనులు

**-పనులను ప్రారంభించిన కార్పోరేటర్ పుష్పనగేష్**

**రామచంద్రాపురం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం సండే మార్కెట్ నుంచి బస్‌రూట్ హిందూ శ్మశానం వరకు చేపడుతున్న సుందరీకరణ పనుల్లో భాగంగా శనివారం రూ.35 లక్షలతోచేపట్టే సెంటర్‌డివైడర్ పనులను కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ భూమిపూజతో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మావిన్‌గౌడ్, పీటర్‌జైపాల్, నవీన్‌గౌడ్, గోపాలకృష్ణ, శామ్యూల్, వినయ్‌కుమార్, నాగభూషణం, బైకన్ నవీన్‌యాదవ్, కాశాల వీరేశం, హన్మంతు, రమేష్, సుంకు స్వామి, ఉమామహేష్, కిషోర్, ఖాజా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌ను విమర్శించే నైతికహక్కు మంత్రులకు లేదు

**-కెసిఆర్ జపం మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి**
**-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుపై కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, వివేక్ వెంకటస్వామిలు చేసిన వ్యాఖ్యలను మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ అంటేనే కెసిఆర్ అడ్డా అని, గజ్వేల్ నియోజకవర్గంలో 95 స్థానాలకు పైగా బిఆర్ఎస్‌సర్పంచులు గెలుచుకున్నారన్నారు. కొంత మంది స్వతంత్రంగా పోటీచేసిన సర్పంచులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, త్వరలో కాంగ్రెస్‌సర్పంచులు సైతం బిఆర్ఎస్ పార్టీలోకి వస్తారని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన కేవలం 60మంది సర్పంచులు గెలిస్తే, 90మంది అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రులకు తెలియకుండా మాట్లాడుతున్నారని, ఇద్దరు మంత్రులు గజ్వేల్ నియోజకవర్గానికి రెండు, మూడుసార్లు వచ్చినా నయాపైసా నిధులను విడుదల చేయలేదన్నారు. కెసిఆర్ జపం చేయనిదే కాంగ్రెస్ మంత్రులకు, ముఖ్యమంత్రికి నిద్రపట్టదని మండిపడ్డారు. మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా, గజ్వేల్ నియోజకవర్గంలో పైసా అభివృద్ధిపని చేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మంత్రులకు కెసిఆర్‌ను విమర్శించే నైతికహక్కు లేదని, గజ్వేల్ అభివృద్ధి, సంక్షేమం కోసం ఏమిచేస్తారో చెప్పాలి కాని కెసిఆర్‌పై విమర్శలు చేస్తే మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు.

## డంప్ యార్డును తొలగించాలి

**-మున్సిపల్ కమిషనర్‌కు సర్పంచుల వినతి**



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

**గజ్వేల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణ శివారులో ఏర్పాటుచేసిన డంప్ యార్డును తొలగించాలని దాచారం, సింగాటం, అనంతరావుపల్లి, ర్యాగట్లపల్లి, బయ్యారం సర్పంచులు శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా దాచారం గ్రామ సర్పంచి చెన్నారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వాగుగడ్డ హనుమాన్ దేవాలయం సమీపంలో ఉన్న డంప్ యార్డులో పలుమార్లు మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించడం వల్ల డంప్‌యార్డుకు సమీపంలో ఉన్న తమ గ్రామాలను పొగ కమ్మేస్తుందని తెలిపారు. దీనివల్ల గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతోపాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈవిషయంపై మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ స్పందించకుంటే జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందిస్తామని ఈసందర్భంగా తెలిపారు. నెలరోజుల్లో మాసమస్యను పరిష్కరించకుంటే గ్రామస్థులతో కలిసి మున్సిపల్‌కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్, సౌందర్య, మల్లేశం, మహేష్, యాదగిరిలు పాల్గొన్నారు.

## మాగ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి



హకీంపేట్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

**మర్కుక్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గంగాపూర్ గ్రామ ప్రజలు శనివారం తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని హకీంపేట్ బస్సుడిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, గౌరారం నుండి పాములపర్తి, మర్కుక్, గంగాపూర్, ఎర్రవల్లి, నర్సన్నపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌ను కోరినట్లు తెలిపారు. హైద్రాబాద్‌కు వివిధరకాల పనుల నిమిత్తం విద్యార్థులు, వృద్ధులు, గ్రామస్థులు ప్రతినిత్యం పదులసంఖ్యలో వెళ్తుంటామన్నారు. గౌరారంనుండి తమగ్రామానికి సుమారు 10కిలోమీటర్ల వరకు ఉంటుందని, బస్సు సౌకర్యంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డిపో మేనేజర్‌కు విజ్ఞప్తిచేశామని తెలిపారు.

## భక్తులకు కొంగు బంగారం శ్రీకైలాస కోటేశ్వరస్వామి దేవాలయం

**రామాయంపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
కొండగుట్టల మధ్య వెలసిన శ్రీకైలాస కోటేశ్వరస్వామి దేవాలయం భక్తుల కోరికలుతీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. మెదక్‌జిల్లా రామాయంపేట మండలం దంతేపల్లిగ్రామ శివారులోని కామారెడ్డి జిల్లా సరిహద్దు అటవీప్రాంతంలోని కాకులగండి వద్ద స్వయంభువుగా వెలసిన శ్రీకైలాస కోటేశ్వరస్వామి దేవాలయం కోరిన కోరికలుతీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. సుమారు 20 గ్రామాలకు చెందిన భక్తులు క్షేత్రంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం, శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తిగీతాలు, భజనలు, కీర్తనలతో స్వామివారి ఆరాధన చేస్తున్నారు. ప్రతి శివరాత్రి, ఉగాది పర్వదినం సందర్భంగా విశేషపూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తుంటారని గ్రామ సర్పంచ్ బాలరాజు తెలిపారు.

## మాజీమంత్రిని కలిసిన సర్పంచి, పాలకవర్గం



హరీష్‌రావుకు పూల మొక్కను అందజేస్తున్న రాణిమల్లేశం

**మర్కుక్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మర్కుక్ నూతన సర్పంచి రాణిమల్లేశం, ఉపసర్పంచి సాయిని మహేష్‌లు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గ్రామ అభివృద్ధి, స్థానికసమస్యలు, పార్టీబలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని మాజీమంత్రి హరీష్‌రావు అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీసర్పంచి భాస్కర్, వార్డుసభ్యులు నాగరాజు, సతీష్‌గౌడ్, కల్పనరాజు, నాయకులు రాంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనుగౌడ్, మల్లేశం, శ్రీను, ఐలయ్య, బాబు, లింగం, కరుణాకర్, స్వామి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## గోవుల తరలింపును అడ్డుకున్న సర్పంచులు



గోవులను తరలిస్తున్న ఆటోను అడ్డుకుంటున్న సర్పంచులు

**నాగల్‌గిద్ద, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సక్రునాయక్‌తండా వద్ద గోవులను తరలిస్తున్న ఆటోను సర్పంచులు శనివారం అడ్డుకున్నారు. ఆటో (టిఎస్ 10 యుబి 9182)లో 4 గోవులను తరలిస్తున్నట్లు గమనించిన మండలపరిధిలోని కరస్‌గుత్తి, శిఖర్ ఖానా గ్రామాల సర్పంచులు కవితనారాయణ, సంగ్‌శెట్టిలు ఆటోను అడ్డుకున్నారు. గోవుల అక్రమరవాణాను ప్రతి ఒక్కరు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని సర్పంచులు గుర్తుచేశారు.

## అక్కన్నపేట ఉపసర్పంచ్‌తోపాటు వార్డుసభ్యులు కాంగ్రెస్‌లో చేరిక



ప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి హనుమంతరావు

**రామాయంపేట, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ ఉపసర్పంచ్ ఎం.ఎన్.ప్రసాద్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ప్రసాద్‌తో పాటు వార్డుసభ్యులు దొమ్మాట వెంకటేష్‌గౌడ్, శివప్రసాద్, శశిధర్, సురేందర్, ఎ.రమేష్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామ అభివృద్ధి జరుగుతుందని తాము పార్టీలో చేరినట్లు తెలిపారు.

# డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని రాస్తారోకో

**-అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం**
**-పేదలకు డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకపోతే డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కబ్జాచేస్తాం**
**-ఇళ్లను పంపిణీచేయడానికి నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**




రాస్తారోకో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి బిఆర్ఎస్ నాయకులు తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తయినా, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో పేదలకు పంపిణీ చేయడం లేదని, వెంటనే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీచేయాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ సమీపంలోని వెల్దుర్తి రోడ్డులోగల డబల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అక్కడినుండి పాదయాత్రగా అంబేద్కర్ చౌరస్తావద్దకు చేరుకొని రాస్తారోకో నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిఎం డౌన్ డౌన్, కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ రాస్తారోకోతో చౌరస్తాలో ట్రాఫిక్ స్తంభించిపోగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ, కెసిఆర్ హయాంలో నిర్మించి, పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతూ విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినా, డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీచేయాలని ఆమె డిమాండ్‌చేశారు. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీచేయని పక్షంలో లబ్దిదారులతో కలిసి సంక్రాంతి పండుగ తర్వాత డబల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలను పగలగొట్టి లబ్దిదారులతో కలిసి కబ్జాచేస్తామన్నారు. అంతేగాక పట్టణంలో అసంపూర్తిగా నిర్మాణాలు జరిగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డ్ వంటి అభివృద్ధిపనులు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో ఎటువంటి అల్లర్లు అలజడులు జరగకుండా సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నయీముద్దీన్, మాజీ జడ్‌పిటిసి బాబ్యానాయక్, మండలాధ్యక్షులు భోగశేఖర్, పట్టణాధ్యక్షులు పంబాల బిక్షపతి, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, మాజీసర్పంచులు, జితేందర్‌రెడ్డి, నడిపి లావణ్య రవి, సేనాధిపతి, కరుణాకర్, సోమ్యానాయక్, ఉమ్లానాయక్, మధుకర్‌రెడ్డి, నూతన సర్పంచులు నీరుడు బిక్షపతి, నాయకులు రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, పిల్లి ఆనంద్‌కుమార్, మహమ్మద్, ఆంజనేయులుగౌడ్, జ్ఞానేశ్వర్‌గుప్త, రాకేష్‌గౌడ్, లబ్దిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన వేంకటేశ్వర ఆలయం

**అల్లాదుర్గం, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీవేంకటేశ్వర ఆలయం ఈ నెల 30న నిర్వహించే వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ముస్తాబయింది. 30న ఉదయం 5గంటల నుంచి సుప్రభాతసేవ, పంచామృతంతో అభిషేకం, ఉదయం 7గంటలకు ఉత్తరద్వారపూజ, భక్తులకు ఉత్తరద్వార దర్శనం, 11.30గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసకళ్యాణం, సాయంత్రం 4గంటలకు చిన్నారులచే భరతనాట్యప్రదర్శన, 5గంటలకు భజనకార్యక్రమాలు, రథోత్సవం, రాత్రి 9గంటలకు సాయంకాలంపూజ మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ, ఉత్తరద్వారంగుండా వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరుగుతుందని ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు స్వామివారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయానికి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుని శ్రీవేంకటేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ బాధ్యులు సూచించారు.

## రామనామ స్మరణతోనే మనశ్శాంతి

**-నాచగిరి ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్త**



భద్రాచల ముక్కోటి ఏకాదశి గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వర్గల్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
శ్రీరామ అంటే సకలశుభాలు కలుగుతాయని, రామనామ స్మరణతోనే మనశ్శాంతి అని నాచగిరి ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్త అన్నారు. శనివారం భద్రాచలం దేవస్థానం ముక్కోటి ఏకాదశికి సంబంధించిన గోడపత్రికలను శ్రీరామకోటి భక్తసమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు నాచగిరి ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్తతో కలిసి నాచగిరిక్షేత్రం ఆవరణలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా భద్రాచల దేవస్థాన ముక్కోటి ఏకాదశి ఆహ్వానపత్రికను రామకోటి రామరాజు నాచగిరి ఆలయ చైర్మన్ రవీందర్‌గుప్తకు అందజేశారు. రామకోటి రామరాజుచే దేవాలయంలో ప్రత్యేకపూజలు చేయించి ఆలయ అధికారులు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు జగన్నాథచార్యులు, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, గోలి కిష్టయ్య, సుధాకర్, ముత్యాలు, రాజా నర్సింగరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశికి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



మాట్లాడుతున్న ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తరద్వారంగుండా స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు అన్నారు. శనివారం ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కైలాస లక్ష్మణ్, కమిటీసభ్యులతో కలిసి ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు ఆలయంలో విశేషపూజలు, పల్లకిసేవ నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈనెల 30వతేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశిన భక్తులు స్వామివారిని దర్శించేందుకు ఉత్తరద్వారం నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఆనాడు భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారికృపకు పాత్రులు కావాలని కోరారు.

ఫొటో/సిద్దిపేట-6 : మిమిక్రి కళాకారున్ని సత్కారిస్తున్న దృశ్యం

## ఘనంగా మిమిక్రీ వేడుకలు



మిమిక్రీ కళాకారుడిని సత్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
జిల్లాకేంద్రంలోని భారత్‌నగర్ శ్రీవాణిస్కూల్‌లో శనివారం మిమిక్రీ, వెంట్రిలోక్విజం ప్రదర్శనలు నిర్వహించారు. ప్రముఖ మిమిక్రీ వెంట్రిలోక్విజం కళాకారుడు వై.రమేష్ తమ అనుకరణ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని రసవత్తరంగా నిర్వహించారు. ప్రసిద్ధకళాకారుల కంఠస్వరాలను. జంతువుల శబ్దాలను అద్భుతంగా అనుకరిస్తూ అందరినీ అలరించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్.సత్యం మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసం పెంచేలా ఈకార్యక్రమం నిలిచిందన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సిహెచ్.సత్యం, వై.రమేష్‌ను శాలువాతో, మొమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సజ్జాపూర్‌లో బోర్ డ్రిల్లింగ్



బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 27, ప్రభాతవార్త:**
కోహీర్ మండలపరిధిలోని సజ్జాపూర్‌లో శనివారం తాగునీటి సౌకర్యానికై ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బోరుడ్రిల్లింగ్‌ను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామంలో కాంగ్రెస్ వేయించిన బోరునుంచి నీటిని తోడుకోవద్దని కాంగ్రెస్ నాయకులు హుకుం జారీ చేసినట్లు మహిళలు ఎమ్మెల్యేదృష్టికి తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బోరు డ్రిల్ అయ్యేలా చేశారు. గ్రామంలో బోరును వేయించిన ఎమ్మెల్యే మాణిక్‌రావుకు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింలు యాదవ్, నాయకులు లక్ష్మాపురం భూమయ్య, బిలాల్‌పూర్ మాజీ సర్పంచ్ నర్సింలు, గ్రామస్థులు గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దళిత సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.